క్లుప్తంగా

స్వామిత్ర సర్వే వేగవంతం చేయాలి

బిక్కవోలు: మండలంలో స్వామిత్ర సర్వే వేగవంతం చేయాలని ఈవోపీఆర్డీ బి.భవాని అన్నారు. బుధవారం పందలపాక సచివాలయం–2లో వలంటీర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటికి నోటీసులు అందించి సర్వేకు వారి అనుమతి తీసుకోవాలన్నారు. అనంతరం ఈ నెల 21న సచివాలయం వద్ద నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సంపరలో గడప గడపకూ..

పెదపూడి: మండలంలోని సంపరలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నిర్వహించనున్నారని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. కార్యక్రమానికి వివిధ శాఖాధికారులు, గ్రామ వలంటీర్లు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.మల్లేశ్వరరావును సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈవోపీఆర్డీ బి.భవాని బుధవారం తెలిపారు. కోర్టు ఉత్తర్వుల్ని ఉల్లంఘించి బలభద్రపురంలో ఒక అక్రమ లేఅవుట్‌లో రోడ్డు, డ్రైయిన్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన కారణంగా అతడిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలంటూ ఆందోళన

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు శివారు గ్రామం తోటపేటలో చేపట్టిన సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలంటూ స్థానికులు తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు.

జెడ్పీటీసీని కలిసిన ఏడీఏ

రంగంపేట: అనపర్తి విద్యుత్తు శాఖ ఏడీఏగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన నిరంజన్‌బాబు బుధవారం స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్నలను మండల పరిషత్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా ఏడీఏగా బాధ్యతలు చేపట్టిన నిరంజన్‌బాబుకు జెడ్పీటీసీ రాంబాబు, కో–ఆప్షన్ సభ్యుడు చంద్రన్నలు శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్ ఎంపీపీ రాయుడు రాంబాబు, విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా యుగంధర్

గోకవరం: మండలంలోని ఇటికాయలపల్లి పంచాయతీ గోపాలపురానికి చెందిన న్యాయవాది పేదూరి యుగంధర్ బీజేపీ ఎస్సీ మోర్చా లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు అందినట్టు ఆయన తెలిపారు. ఎటువంటి కుల, మత, వర్గ బేధాలకు తావులేకుండా బీజేపీ అందరినీ సమానంగా చూస్తోందన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

రూ.20 లక్షలతో అమ్మవార్లకు అలంకరణ



మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు బుధవారం గోకవరం దేవీచౌక్ ఆలయంలో కనకదుర్గమ్మ శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారిని రూ.20 లక్షల నగదుతో మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రికి అమ్మవారి ఆలయం వద్ద భవానీ భక్తులు పడిపూజ నిర్వహించారు. వీరభద్రునిగడ్డలోని కనకదుర్గమ్మ మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు మహాచండీదేవి అలంకారం

శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం దేవీచౌక్, వీరభద్రునిగడ్డిలో కొలువైన శ్రీకనకదుర్గమ్మ మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రాజాయోనాకు కళారత్న పురస్కారం

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ తెలుగు సంఘాలన్నీ కలిసి ఢిల్లీ తెలుగు కళాదర్బార్ పేరుతో న్యూఢిల్లీలోని ఆంధ్రా భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలలో తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు కృషి చేసిన 15 మంది ప్రతిభావంతులకు జాతీయ పురస్కారాలు అందించాయి. ఇందులో భాగంగా ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ద్వారా దేశ, విదేశాల్లో ఎన్నో కార్యక్రమాలు చేసి, ఎందరో సాహితీ వేత్తలను, కళాకారులను ప్రోత్సహిస్తున్న అద్దంకి రాజాయోనాకు పురస్కారం లభించింది.

ఎండు తెగులుతో కలవరం

- వరిని ఆశిస్తున్న ఖైనం
- వాతావరణ మార్పులే కారణం



రామచంద్రపురంలో ఎండు తెగులు ఆశించిన వరి పొలం

సీతానగరం: వరి పంటను ఆకుఎండు తెగులు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు 15 వేల ఎకరాలలో ఖరీఫ్‌లో వరిసాగు చేశారు. ఇందులో సాంబా మసూరు రకాన్ని సుమారు అయిదు వేల ఎకరాలలో పండించారు. ఈ రకానికి ఎండు తెగులు వేగంగా సోకుతోంది. ఈ ఏడాది చోటుచేసుకున్న వాతావరణ మార్పులతో ఈ తెగులు ఆశించింది. అధికంగా ఈ తెగులు కనిపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి నాట్లు వేసిన అనంతరం సేడ్‌లు తీయాల్సి ఉంది. దీని వల్ల పంటకు గాలి చక్కగా తగులుతుంది. అంతేకాకుండా క్రిమిసంహారక మందులు పిచికారీ చేయడానికి ఎంతో వీలుగా ఉంటుంది. నెల రోజుల క్రితం అధిక వర్షాలు, అనంతరం ఉష్ణోగ్రతలు వంటి వాతావరణ మార్పుల వలన ఎండు తెగులు ఆశిస్తోంది.

వేగంగా వ్యాప్తి

ఎండు తెగులు బాక్టీరియా కారణంగా ఆశిస్తుంది. ఉదయం సమయంలో వరి ఆకులపై జిగురు ఏర్పడి, నీటి ద్వారా ఇతర పొలాలకు వ్యాపిస్తుంది. వరి ఆకు పసుపు రంగుకు మారి ఎండిపోతుంది. వాతావరణం చల్లదనంగా ఉన్న కాలంలో ఎండు తెగులు చాలా వేగంగా వ్యాప్తి చెందుతుంది. దీనితో వరి పంట దిగుబడి బాగా తగ్గుతుంది. దీనికి నివారణకు ఎటువంటి మందులు లేవనే చెప్పవచ్చు. దీనిని తాత్కాలిక ఉపశమనానికి కొన్ని యాజమాన్య పద్ధతులు పాటించాలి. పొలంలోని మురుగునీరు ఎప్పటికప్పుడు తీసివేయాలి. అలాగే పొలం గట్లపై కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. ఈ చర్యలు చేపడితే ఎండు తెగులు వ్యాప్తిని తగ్గించవచ్చు.

వాతావరణ మార్పులతో..



మూడు ఎకరాల్లో వరి పంట వేశాను. ఎండు తెగులు ఎక్కువగా ఉంది. ఎన్ని మందులు కొట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. వాతావరణ మార్పులతో ఇది ఆశించింది. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలి. ఏ మందులు వాడినా ప్రయోజనం లేదు.

– గెద్దె వీరన్న బాబు, రైతు, రామచంద్రపురం

మందు లేదు



ఎండు తెగులుకు మందు లేదు. ఈ తెగులు ఆశించిన పంటపొలంలో యూరియా ఎరువు తాత్కాలికంగా నిలిపివేయాలి. పొటాష్ ఎకరానికి 20 కిలోలు వేయాలి. పొలంలో మురుగునీరు తీసివేయాలి. వర్షాలు తగ్గి వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగితే ఎండు తెగులుకు నివారణ జరుగుతుంది. తెగులు ఉధృతిని తగ్గించడానికి ఎకరానికి ప్లాంటోమైసిన్ 20 గ్రాములు, కాపర్ ఆక్సిక్లోరైడ్ 400 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

– కె.సూర్యరమేష్, మండల వ్యవసాయాధికారి

భద్రతా చర్యలతో విద్యుత్ ప్రమాదాల నివారణ

- ఈపీడీసీఎల్ ఈఈ శ్రీధర్ వర్మ
- కోరుకొండలో సిబ్బందితో సమీక్ష

మధురపూడి: భద్రతా చర్యలు తీసుకోవడం ద్వారా విద్యుత్ ప్రమాదాలను అరికట్టగలమని ఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ అన్నారు. కోరుకొండలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో గురువారం కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల సిబ్బందితో క్షేత్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీధర్ వర్మ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వ్యవసాయ రంగానికి 9 గంటల విద్యుత్ అందించేందుకు ఫీడర్‌ను సెపరేట్ చేస్తున్నామన్నారు. ఈ పనులు మార్చి నెలాఖారులోపు పూర్తవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 3 ఫేజ్ ద్వారా విద్యుత్ సరఫరా చేయనున్నట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో పని విధానాన్ని మెరుగుపర్చుకోవాలని, మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు లైన్‌మెన్లు, సహాయక లైన్‌మెన్లు, సిబ్బంది కృషి చేయాలన్నారు. వేసవిలో ఎద్దడి లేకుండా ఉండేందుకు, లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి అవసరమైనచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు నిర్మించనున్నట్టు, కొత్త సబ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. కోరుకొండ మండలం నర్సాపురం, సీతానగరం మండలం చినకొండేపూడి గ్రామాల్లో సబ్ స్టేషన్ల నిర్మాణం జరుగుతోందని ఈఈ తెలిపారు. రాజానగరం మండలం రాధేయపాలెంలో సబ్ స్టేషన్ నిర్మాణం జరిగిందన్నారు. 15 రోజుల్లో దానిని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ జగనన్న ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. అయితే 200 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగం ఉండకూడదన్నారు. సమావేశంలో డిప్యూటీ ఈఈ డి.చిట్టిరాజు, ఏఈలు మదర్సా, చంద్రమోహన్, అశోక్, అసిస్టెంట్ ఎకౌంట్స్ ఆఫీసర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

త్రివిక్రమ్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



విద్యార్థి త్రివిక్రమ్, డ్రాయింగ్ టీచర్ సత్యానందాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: చీరలపై వర్క్ చేసేందుకు ఉపయోగించే స్టోన్స్‌ను వినియోగించి చంద్రయాన్–3 ప్రాజెక్ట్‌ను రూపొందించిన మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న దాస్యం వెంకట త్రివిక్రమ్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. సుమారు 2,40,990 స్టోన్స్ వినియోగించి అతి తక్కువ సమయంలో చంద్రయాన్–3 ప్రాజెక్ట్‌ను తయారుచేసినందుకు గాను త్రివిక్రమ్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో పాటు మార్వెలెస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఫేమస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్, హైరేంజ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించాడు. విద్యార్థి త్రివిక్రమ్‌ను, అతడిని ప్రోత్సహించిన డ్రాయింగ్ టీచర్ మండపల్లి సత్యానందంను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



పందలపాకలో వెలమ సంక్షేమ సంఘ భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పందలపాక వెలంపేట వద్ద ఉన్న శ్రీబ్రహ్మనాయుడు వెలమ సంక్షేమ సంఘం భవనాన్ని, జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాలులను ప్రారంభించారు. మహిళల కోసం నిర్మించనున్న మహిళల కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. దేశంలో ఇంత పెద్దఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రత్యేక పథకాలను అమలు పరుస్తున్నామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులను వెలమ సంఘం సభ్యులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, జిల్లా మహిళా స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, అనపర్తి, మండపేట నియోజకవర్గాల వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల అప్పాజీ, రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీలు కర్రి గీతా సావిత్రి, మచ్చాపాప, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

రాంబాబుకు రైతునేస్తం పురస్కారం

రాజానగరం: నరేంద్రపురానికి చెందిన యువరైతు ప్రగడ రాంబాబుకు రైతునేస్తం పురస్కారం లభించింది. రైతునేస్తం 19వ వార్షికోత్సవం కృష్ణా జిల్లా ఆత్మకూరు స్వర్ణభారతి ట్రస్టులో ఈ నెల 14న జరిగాయి. ఈ సందర్భంగా వ్యవసాయరంగానికి విశేషంగా సేవలందించిన దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ డాక్టర్ ఐవీ సుబ్బారావు పేరిట వ్యవసాయ, అనుబంధ రంగాలలో విశిష్ట సేవలందిస్తున్న శాస్త్రవేత్తలు, విస్తర్ణాధికారులు, రైతులకు పురస్కారాలు అందజేశారు. వారిలో ప్రగడ రాంబాబు ఉన్నారు.



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న రాంబాబు

అష్టైశ్వర్య ప్రదాయిని.. పాహిమాం..

అనపర్తి: దసరా శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా గ్రామాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. స్థానిక శ్రీవీరుళ్లమ్మ వారి దేవస్థాన కమిటీ సారథ్యంలో ఓంశక్తి సత్సంగం సభ్యుల ఆధ్వర్యంలో త్రిశక్తి పీఠంలో కొలువుతీర్చిన అమ్మవారు బుధవారం మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భవానీ దీక్షధారులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

అగ్ని గుండం తొక్కిన భక్తులు

బిక్కవోలు: మండలంలోని శ్రీదేవీ నవరాత్రుల్లో భాగంగా కొమరిపాలెం శ్రీకనకదుర్గమ్మ తల్లి ఆలయం వద్ద మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పందలపాక వెలమపేట రామాలయం వద్ద కొలువైన శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద బుధవారం తెల్లవారుజామున భవానీ భక్తులు అగ్ని గుండాన్ని తొక్కారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పెదపూడి: జి.మామిడాడలోని మణికంఠ స్వామి ఆలయంలో కొలువైన దుర్గమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని పెదపూడి, పెద్దాడ, కాండ్రేగుల, రామేశ్వరం, ఏపీ త్రయం, దోమాడ, కరకుదురు, సంపర తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు.



అనపర్తి త్రిశక్తి పీఠంలో మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



జి.మామిడాడలో మహాలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మవారు

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేద్దాం

సీతానగరం: ఖరీఫ్‌లో రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేద్దామని తహసీల్దార్ పి.కృష్ణారావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆర్బీకే వీఏఏలు, పీఏసీఎస్ సీఈవోలు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, ఎస్సై కె.చిరంజీవి పాల్గొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వాటికి 1.60 లక్షల గోనె సంచులు వచ్చాయని, మరికొన్ని రావాల్సి ఉందన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద కాటాలు, తేమశాతం మిషన్లు, కంప్యూటర్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. సమావేశానికి రాని మిల్లర్లకు నోటీసులు జారీ చేయాలని ఆర్ఐ లక్ష్మికి ఆదేశించారు.

గోనె సంచుల స్వాధీనం

రఘుదేవపురంలోని కార్తికేయ, వెంకటేశ్వర రైస్ మిల్లుల వద్దకు మండల స్పెషల్ ఆఫీసర్ జి.శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణారావు, ఆర్ఐ లక్ష్మి తరలివెళ్లి సంచులు అందించాలని ఆదేశించారు. దానికి తమ అసోసియేషన్ వారు ఇవ్వవద్దని తెలిపారని, అందుకే సంచులు ఇవ్వడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తప్పని సరిగా సంచులు ఇవ్వాల్సిందేని తెలిపారు. పీఏసీఎస్ సీఈవోలు ములగాల రామకృష్ణ, కాట్నం వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు, నాగేశ్వరరావు, గుప్త, సుబ్బరాజు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణారావు, ఆర్బీకే చైర్మన్

ధాన్యం కొనుగోలులో సహకరించాలి

మధురపూడి: ధాన్యం కొనుగోలులో రైతులకు అన్నివిధాలా సహాయ, సహకారాలు అందించాలని ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు అన్నారు. కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం రైతులు, మిల్లర్లు, వ్యవసాయ శాఖ సహాయకులతో మైత్రీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కొందరు వ్యవసాయశాఖ అధికారుల అలసత్వం కారణంగా కొన్ని సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సందర్భంగా గోనె సంచుల కొరత ఏర్పడుతోందన్నారు. సుదూర ప్రాంతాల మిల్లులకు కాకుండా స్థానిక మిల్లర్లు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆశాఖ మండలాధికారి ఏ.గౌరీదేవి, సివిల్ సప్లై విభాగం టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ, మిల్లర్ల యూనియన్ నాయకులు బీశెట్టి గణపతిరావు పాల్గొన్నారు.

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష



రాజానగరం మండలం ముక్కినాడలో మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెదపూడి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. కైకవోలు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. శిబిరంలో 454 మందికి వైద్య సేవలందించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ నూని పట్టాభిరామన్న చౌదరి, ఎంపీడీఓ పి.విజయభాస్కర్, ఉప సర్పంచ్ కొప్పిశెట్టి వీరశంకర్, ఎంపీటీసీ సభ్యుడు టి.రాజు, సచివాలయ కార్యదర్శి తరుణ తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించాలనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. మండల పరిధిలోని దొడ్డిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 550 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైస్ ఎంపీపీ రాయుడు రాంబాబు, అనపర్తి ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కారి సంజీవరావు, ఎంపీటీసీ మడికిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు విశేష స్పందన

అనపర్తి: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం–5 పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, ఎంపీటీసీలు ఏడుకొండలు, కొండేటి భీమేష్, తహసీల్దార్ వై.సరస్వతి, పంచాయితీ కార్యదర్శి మల్లిడి విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీడీఓ బి.రామారావు అన్నారు. మండలంలోని ముక్కినాడలో బుధవారం నిర్వహించిన శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.రవికుమార్ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు జరిగాయి. మల్లంపూడి, ముక్కినాడ, ముక్కినాడ పాకలు, పీఆర్సీపురం నుంచి వచ్చిన 604 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మండెల్లి సునీల, రాజానగరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ ఉపాధ్యక్షుడు అనదాస సాయిరామ్, ఏఓ సుబ్రహ్మణ్యం, వైద్యులు విక్రమ్, వెంకటలక్ష్మి, సుష్మ, అఖిలాండేశ్వరి, పంచాయతీ కార్యదర్శి ఎం.పైడిరాజు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో 604 మందికి వైద్యసేవలు

సీతానగరం: చీపురపల్లి ఎంపీయూపీ స్కూల్లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 604 మందికి వైద్య పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ రాజు, డాక్టర్ ఏసురాణి, స్పెషలిస్టులు రవీంద్రనాథ్ (న్యూరో), కె.వెంకట శరీష్మ (జనరల్ మెడిసిన్), బి.సత్య ప్రసాద్ (కంటి) వైద్య సేవలు అందించారు. 21 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. 47 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 42 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. గతంలో పరీక్షలు నిర్వహించిన నలుగురికి కళ్లజోళ్లు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దోసపాటి వీరచంద్రం, గోపిశెట్టి సత్య అనురాధ, ఎంపీటీసీ బేడ్సి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ మోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు గోపిశెట్టి అచ్చారావు, మన్నెల్లి వెంకట్రావు, గోపిశెట్టి తులసీరామ్, బిల్లకుర్తి వీరబ్రహ్మం, సాకిరి రాంబాబు, వడితే రాంబాబు పాల్గొన్నారు.

గోకవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష

గోకవరం: స్థానిక సచివాలయం–3 వద్ద బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, సర్పంచ్ కొమరం శ్రావణి ప్రారంభించారు. డాక్టర్లు గ్రామంలోని సుమారు 300 మందికి వైద్య సేవలందించారు. పరీక్షలు చేయించుకున్న రోగులకు నాయకులు మందుల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యురాలు షేక్ మీరాబీ, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, నాయకులు నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్, ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



గోకవరంలో రోగులకు మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి



సీతానగరం మండలం చీపురపల్లిలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు



కైకవోలులో మందులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సుభాష్



దొడ్డిగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు